

ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలి

ప్రతి ఒక్క విద్యార్థి క్రీడాల్లో పాల్గొనాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి పాలిటెక్నిక్ విద్యార్థుల క్రీడా పోటీలను ప్రారంభించారు. - 8లో..



ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరా

ప్రతి ఇంటికీ మంచినీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. వల్లూరులో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29 /21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

డీఈవో వెబ్‌సైట్‌లో పదోన్నతుల సీనియార్టీ జాబితా

ఒంగోలు: స్కూల్ అసిస్టెంట్స్ ఉర్దూ మీడియంలో స్కూల్ అసిస్టెంట్స్ సోషల్ స్టడీస్, బయోలాజికల్ సైన్స్, గణితం, భౌతిక శాస్త్రంలకు సంబంధించి జెడ్పీ మేనేజ్‌మెంట్ పదోన్నతులు నిర్వహించేందుకు సీనియార్టీ జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో బి.విజయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులు వారి సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టరు కాపీలను జతపరిచి మండల విద్యాశాఖ అధికారి లేదా హెడ్మాస్టర్ ద్వారా వారి అభ్యర్థనలను శుక్రవారం సాయంత్రం 5 గంటలలోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు.

11 నుంచి జాతీయ స్థాయి బండలాగుడు ఎడ్ల బల ప్రదర్శన

పర్చూరు: అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో ఈ నెల 11 వ తేదీ బుధవారం నుంచి గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ 35వ జాతీయస్థాయి బండలాగు ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గోరంట్ల భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీన జూనియర్స్ విభాగంలో పోలురాథ, 12న సీనియర్స్ విభాగంలో పోలురాథ, 13న పాలపళ్ల విభాగంలో, 14న రెండు పళ్ల విభాగంలో, 15న నాలుగు పళ్ల విభాగంలో, 16న ఆరు పళ్ల విభాగంలో, 17న సేద్యపు విభాగంలో, 18న సబ్‌జూనియర్స్ విభాగంలో, 19న పెద్దసైజు విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే 14వ తేదీ ఆవుల అందాల పోటీల్లో పాలపళ్ల విభాగం, రెండు నుంచి నాలుగు పళ్ల విభాగం, ఆరు నుంచి ఎనిమిది పళ్ల విభాగంలో అందాల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 96420 56695, 99631 90190 సెల్ నంబర్లను సంప్రదించగలరు.

జగనన్న సచివాలయ కన్వీనర్ల కోఆర్డినేటర్‌గా శివశంకర్‌రెడ్డి

ఒంగోలు: జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఐదు జిల్లాల కోఆర్డినేటర్‌గా పుట్టా శివశంకర్‌రెడ్డిని నియమించారు. ఆమేరకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. శివశంకర్‌రెడ్డి ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు కోఆర్డినేటర్‌గా పనిచేస్తారు.

సంచార జాతుల జీవన శైలిలో మార్పులు తేవాలి

ఒంగోలు సబర్బన్: సంచార, మినీ సంచార జాతుల అభివృద్ధి దిశగా మార్పులు తేవాలని, అందుకు అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత శాఖకు చెందిన సభ్యుడు తుర్కా నరశింహ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక ప్రకాశం భవన్‌లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సంచార జాతులకు చెందిన వారి పిల్లలకు అవకాశాలు కల్పించి వారిని విద్య వైపు దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను వారి దరి చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో సంచార జాతులకు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలుత రెండు రోజుల పాటు ఆయన సంచార జాతులు నివసించే ప్రాంతాల్లో పర్యటించారు. ఒంగోలు నగరంలోని జయప్రకాష్ కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, బస్టాండ్ సెంటర్‌లో నివసించే వారి ప్రాంతాల్లో సభ్యులు పర్యటించి వారి జీవన శైలిని పరిశీలించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జగన్నాథరావు అధ్యక్షతన నిర్వహించిన సమీక్షలో డీఆర్‌ఓ బి.చిన ఓబులేసు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎన్.లక్ష్మా నాయక్, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి అంజలాదేవి, డీఎస్పీతో పాల్గొన్నారు.

12 నుంచి జాతీయస్థాయి ఒంగోలు గిత్తల బల ప్రదర్శన

పర్చూరు: అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో ఈనెల 12వ తేదీ గురువారం నుంచి గోరంట్ల రత్తయ్య చౌదరి క్రీడా ప్రాంగణంలో 35వ జాతీయ స్థాయి బండలాగుడు ఎడ్ల బల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు, మద్రి నాగేశ్వరరావు, నాగళ్ల రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీన జూనియర్స్ విభాగంలో పోలురాథ, 13న సీనియర్స్ విభాగంలో పోలురాథ, 14న నాలుగు పళ్ల విభాగంలో, 15న ఆరు పళ్ల విభాగంలో, 16న కేటగిరి బండ విభాగంలో, 17న సబ్‌జూనియర్స్ విభాగంలో, 18న సీనియర్స్ విభాగంలో, 19న జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే 13, 14వ తేదీల్లో పొట్టేళ్ల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 98850 28187, 99495 30875 సెల్ నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

జిల్లా ఓటర్లు 17,93,666

పురుషులు :	మహిళలు :
8,98,692	8,94,854

థర్డ్ జండర్ ఓటర్లు : 120

మొత్తం ఓటర్లలో సర్వీస్ ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
7,063	2,178

మహిళల కంటే పురుషులు అధికం



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: నూతనంగా ఏర్పడిన ప్రకాశం జిల్లా తుది ఓటర్ల జాబితా విడుదలైంది. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ–2023 ఓటర్ల షెడ్యూల్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ గురువారం విడుదల చేశారు. జిల్లాల పునర్విభజన అనంతరం నూతనంగా ఏర్పడిన ప్రకాశం జిల్లా 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిమితమైంది. పార్లమెంట్ నియోజకవర్గాన్ని కేంద్రంగా చేసుకుని జిల్లాల పునర్విభజన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గానికి వస్తే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో ఉండగా ఒక్క సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం మాత్రం బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఉండిపోయింది. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం ఒంగోలు నగరంలో కలగలసి ఉండటంతో దానిని జిల్లాలోనే ఉంచాల్సి వచ్చింది. నూతనంగా ఏర్పడిన జిల్లాలోని మొత్తం ఓటర్లు 17,93,666 ఉన్నట్లు లెక్కలు తేల్చారు. మొత్తం ఓటర్లలో పురుష ఓటర్లు 8,98,692 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు 8,94,854 మంది ఉన్నారు. వీరిలో సర్వీసు ఓటర్లు 7,063 మంది కాగా, ట్రాన్స్‌జెండర్లు 120 మంది ఉన్నారు. గతంలో జిల్లాలో మహిళా ఓటర్లు అధికంగా ఉండేవారు. అలాంటిది ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో 3,838 మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.

ఓటర్ల సవరణలో భాగంగా 2022 నవంబర్ 9న కలెక్టర్ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించారు. అందుకుగానూ నూతనంగా ఓటరుగా నమోదు చేసుకోవడానికి 2022 నవంబర్ 9 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2022 నవంబర్ 19, 20 తేదీల్లో, డిసెంబర్ 3, 4 తేదీల్లో స్పెషల్ డ్రైవ్‌లు కూడా నిర్వహించారు. అన్ని ప్రక్రియలు పూర్తి చేసిన తర్వాత గురువారం తుది ఓటర్ల జాబితాను ప్రచురించారు. అయితే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విడుదల చేసిన ప్రచురణలో ఓటర్ల జాబితా నిరంతర సవరణ ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు. 2023 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండేవారు అసెంబ్లీ నియోజకవర్గంలో ఆన్‌లైన్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. మరింత సమాచారం, సహాయం కోసం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ), అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (తహసీల్దార్), బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ)లను సంబంధిత కార్యాలయాల్లో సంప్రదించవచ్చన్నారు. దరఖాస్తు విధానం ఆన్‌లైన్ ద్వారా నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్ (ఎన్‌వీఎస్‌పీ) డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్‌లో సంప్రదించవచ్చన్నారు. జిల్లాలోని అర్హులైన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరుగా పేర్లు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

ఓటర్ల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి...

అసెంబ్లీ నియోజకవర్గం/ కోడ్ నంబర్	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
యర్రగొండపాలెం (102)	264	1,01,663	98,521	01	2,00,185
దర్శి (103)	282	1,11,294	1,08,926	19	2,20,239
సంతనూతలపాడు (107)	256	1,06,550	1,09,296	08	2,15,854
ఒంగోలు (108)	256	1,13,377	1,20,838	37	2,34,252
కొండపి (110)	283	1,17,332	1,19,310	03	2,36,645
మార్కాపురం (111)	257	1,07,320	1,04,668	13	2,12,001
గిద్దలూరు (112)	284	1,20,507	1,16,211	22	2,36,740
కనిగిరి (113)	296	1,20,649	1,17,084	17	2,37,750



విలేకరులతో మాట్లాడుతున్న ఒంగోలు మేయర్ గంగాడ సుజాత

అవినీతికి కేరాఫ్ అడ్రస్

దామచర్ల జనార్దన్

- కమీషన్ల కోసమే పనులు ప్రారంభం
- ప్రజలకు సమస్య వస్తే పత్తా ఉండరు
- నిద్రలో సైతం బాలినేని ఫోబియాతో వణికిపోతున్నారు
- మీడియా సమావేశంలో నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: అభివృద్ధి పథం అంటూ అభివృద్ధి భూతాన్ని ప్రజలకు చూపిస్తే నమ్మేందుకు జనం సిద్ధంగా లేరని, అవినీతికి కేరాఫ్‌గా దామచర్ల జనార్దన్ నిలిచిపోయారంటూ నగర మేయర్ గంగాడ సుజాత విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎక్కడైనా పనులు నిలిచిపోతే ఆందోళన చేశామని, కానీ పనులు వేగవంతంగా జరుగుతుంటే దానిని ఎలాగైనా అడ్డుకోవాలనే కుట్రతో నిరసన చేయడం దామచర్లకు మాత్రమే చెల్లిందన్నారు. బకింగ్‌హాం కెనాల్ బ్రిడ్జి కాంట్రాక్టర్ వద్ద కమీషన్‌తో పాటు దాదాపు రూ.10 కోట్ల అప్పు, ఇంకా మరికొంత మంది వద్ద అప్పు తీసుకుని వారిని దామచర్ల ఎలా వేధిస్తుందీ అందరికీ తెలుసన్నారు. మల్లవరం నుంచి నగరానికి పైప్‌లైన్ పనుల్లో ఎంత కక్కుర్తి పడింది, చివరకు టీడీపీ నాయకుల స్థలాలకు పరిహారం ఇవ్వాల్సి వస్తే వదిలేసి పత్తా లేకుండా పోయిన విషయం గురించి అందరికీ తెలిసిందేనని చెప్పారు. చివరకు జనార్దన్ కమీషన్లకు భయపడి కాంట్రాక్టర్లు సైతం పరారయ్యే పరిస్థితి వస్తే వారికి బకాయిలు సైతం తీర్చి నేడు పనులు వేగవంతంగా చేయిస్తుంటే కళ్లుండి చూడలేని స్థితి నెలకొందని విమర్శించారు. నిద్రలో సైతం బాలినేని ఫోబియాతో జనార్దన్ వణికిపోతున్నారన్నారు.

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్ మాట్లాడుతూ మభ్యపెట్టడం, మోసపుచ్చడం అనేది చంద్రబాబు నాయుడికి మాత్రమే వెన్నతో పెట్టిన విద్య అని జనం అనుకునేవారని, కానీ నేడు ఆ జాబితాలో జనార్దన్ కూడా చేరిపోయారని విమర్శించారు. ఒంగోలులో 20 వేల పెన్షన్లు తీసివేశారంటూ మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమని, 2 వేల పెన్షన్లు సాంకేతిక కారణాలతో నిలిచిపోతే తిరిగి వాటిని బాలినేని స్వయంగా పర్యవేక్షించి 1800 పెన్షన్లు పునరుద్ధరించిన విషయాన్ని తెలుసుకోవాలన్నారు. కేవలం పెన్షన్లు తిరిగి వచ్చాయన్న విషయం ప్రజలకు తెలియకూడదనే ఉద్దేశంతోనే ప్లాన్‌చేసి బకింగ్‌హాం కెనాల్ బ్రిడ్జి అంశాన్ని తెరపైకి తెచ్చారంటూ విమర్శించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు మాట్లాడుతూ ప్రతి చోట యాక్టింగ్ షోలు సక్సెస్ కావని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఒంగోలులో ఎంతమంది పేద కుటుంబాలకు పట్టాలు ఇచ్చారు? నేడు వాటి విలువ ఎంతో తెలుసుకుంటే ఆశ్చర్యపోతారని, కానీ జనార్దన్ హయాంలో ఎంత మందికి ఇళ్లపట్టాలు ఇచ్చి ఎంతమంది పేదల ఆస్తులు పెరగడానికి దోహదపడ్డారో సమాధానం చెప్పాలన్నారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోలి తిరుపతిరావు మాట్లాడుతూ రెండేళ్లపాటు కరోనా విలయ తాండవం చేసినప్పుడు ప్రజల్ని కాపాడుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడితే అండగా నిలవాల్సిన ప్రతిపక్ష పార్టీ నేతలు బెంగళూరు, హైదరాబాదులో తలదాచుకుని, నేడు రోడ్ల మీదకు వస్తున్న తీరు చూసి ఇదేం ఖర్మ అంటూ జనం ఈసడించుకునే పరిస్థితి నెలకొందన్నారు. జిల్లా అధికార ప్రతినిధి కావాటి రవికుమార్ మాట్లాడుతూ గోల్డెన్ స్పూన్ అని చెప్పుకునే జనార్దన్‌కు నిద్రలో సైతం బాలినేని కుటుంబాన్ని తలుచుకునే పరిస్థితి దాపురించిందని, బాలినేని ఫోబియాతో వణికిపోతున్నారని విమర్శించారు. టీడీపీ కోసం అంటూ బండ్లమిట్ట వద్ద ముస్లిం దుకాణాలను ధ్వంసం చేసింది, బుడబుక్కల వారి ఇళ్లను ధ్వంసం చేసింది, పంజాబ్ నేషనల్ బ్యాంకు ఉన్న మున్సిపల్ స్థలాన్ని ఎలా కాజేయాలనుకుంది ప్రజలందరికీ తెలుసని, కబ్జాదారు ఎవరు, కనికరించేది ఎవరో కూడా అర్థమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకురాలు తమ్మినేని మాధవి మాట్లాడుతూ టీడీపీ సీనియర్ మహిళా నాయకురాలు కుమార్తె పెళ్లికోసం కాళ్లు పట్టుకుని ఆర్థికసాయం అందించమని జనార్దన్‌ను ప్రాధేయపడితే చివరకు రూ.50 వేలు చేతిలో పెట్టి లక్ష రూపాయలకు ఓచర్ రాయించుకున్నారంటూ మండిపడ్డారు. కార్పొరేటర్ తాడి కృష్ణలత మాట్లాడుతూ అభివృద్ధి మీరు చేస్తే నగరంలో తమ సమస్యలు తీర్చండంటూ జనం మమ్మల్ని ఎందుకు అడుగుతున్నారని, నేడు నిధులు అత్యధికంగా పేద ప్రజానీకం నివాసం ఉండే ప్రాంతాల్లోనే వెచ్చిస్తున్న సంగతి తెలుసుకోవాలన్నారు. బొమ్మనేని మురళి మాట్లాడుతూ బకింగ్‌హాం కెనాల్ ప్రాజెక్టుకు కేవలం 40 శాతం పనులు చేసి 80 శాతం చేశానంటూ ప్రజలను నమ్మించాలని చూడడం జనార్దన్ కుట్రలో భాగమే అన్నారు. 2015లో బ్రిడ్జి మంజూరైతే టెండర్ ఖరారుకు 16 నెలలు, మరో ఏడాదికి అంటే 2017లో శంకుస్థాపన చేశారని..ఇదీ టీడీపీ హయాంలో వేగవంతంగా పనులు జరగడం అంటూ విమర్శించారు. ప్రతి పనిలోను పర్సంటేజీలే అని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జనార్దన్ హయాంలో ప్రతి పనిలోను 20 శాతం అదనానికి టెండర్లు పడడమే ఇందుకు నిదర్శమని మండిపడ్డారు.

ప్రీ రిలీజ్ ఫైనా డ్రామా..!

- వీరసింహారెడ్డి' వేదిక మార్పుపై టీడీపీ స్టైల్ అసత్య ప్రచారం
- ఏబీఎం గ్రౌండ్ కెపాసిటీ సరిపోదనే అనుమతి నిరాకరణ
- వేడుకలకు పూర్తి స్థాయి భద్రత
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు
- పార్కింగ్ సమస్య లేకుండా ఏర్పాట్లు
- పాసులున్న వారికే అనుమతి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ

ఒంగోలు టౌన్: నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన వీరసింహారెడ్డి సినిమా ప్రీ రిలీజ్ వేడుక వేదిక మార్పు విషయంలో తెలుగుదేశం పార్టీ తన సహజశైలిలో తప్పుడు ప్రచారాలకు దిగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి వీరసింహారెడ్డి సినిమా ప్రీ రిలీజ్ వేడుకలను తొలుత ఏబీఎం కళాశాల గ్రౌండులోని 8 ఎకరాల స్థలంలో నిర్వహించేందుకు శ్రేయాస్ మీడియా మూవీ ఈవెంట్స్ సంస్థ నిర్ణయం తీసుకుంది. పోలీసు అనుమతుల ప్రక్రియను పూర్తి చేసుకోకుండా ఏర్పాట్లు మొదలుపెట్టింది. వాస్తవానికి కళాశాల గ్రౌండ్ సామర్థ్యం కేవలం 20 వేల మందికి మాత్రమే సరిపోతుంది. కానీ నిర్వాహకులు 10 వేల మందికి ఎంఐపీ పాసులు, మరో 20 వేల మందికి ఎన్‌బీకే పాసులు జారీ చేస్తున్నట్లు సమాచారం. అంతే కాకుండా వేదిక పరిసరాల్లో ఆస్పత్రి, రైల్వే స్టేషన్ ఉండడం, ఇరుకైన ప్రాంతాలు కావడంతో భారీగా తరలి వచ్చే అభిమానులతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ యు.నాగరాజు, టూటౌన్ సీఐ రాఘవరావు బుధవారం వేదిక ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను తెలుసుకున్నారు. ఏబీఎం గ్రౌండులో వేడుకలు నిర్వహించడం సరైన నిర్ణయం కాదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీసులు ఏబీఎం కళాశాల గ్రౌండులో వేడుకలకు అనుమతిని నిరాకరించారు. అభిమానులకు, నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయంగా అనువైన వేదికను ఎంపిక చేసుకోవాలని పోలీసు అధికారులు సూచించారు. అందుకు అంగీకరించిన నిర్వాహకులు వెంటనే తగిన ఏర్పాట్లు చూసుకున్నారు. త్రోవగుంట సమీపంలోని అర్జున్ ఇన్ ఫ్రా వద్ద సుమారు 15 ఎకరాలకు పైగా ఉన్న ప్రాంతాన్ని ఎంపిక చేసుకొన్నారు. ఇక్కడ ప్రీ రిలీజ్ వేడుకలకు పోలీసులు అనుమతులు ఇచ్చారు. ఈవెంట్ నిర్వహణ విషయంలో పోలీసు అధికారుల సహకారం బాగుందని శ్రేయాస్ ఎండీ గండ్రా శ్రీనివాసరావు మీడియా సమావేశంలో సంతృప్తి వ్యక్తం చేశారు. వాస్తవం ఇది కాగా ఉద్దేశపూర్వకంగా ఏబీఎం వేదికకు పోలీసులు అనుమతులు ఇవ్వలేదని టీడీపీ నాయకులు దుష్ప్రచారానికి తెగబడ్డారు. కందుకూరు, గుంటూరు సభల వద్ద తొక్కిసలాట జరిగి 10 మందికి పైగా ప్రజలు దుర్మరణం పాలైనా ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా వ్యవహరించడాన్ని నగర ప్రజలు వారిపై మండిపడుతున్నారు.

తగిన భద్రతా ఏర్పాట్లు చేశాం:

ఒంగోలు నగరంలోని అర్జున్ ఇన్‌ఫ్రాలో శుక్రవారం నిర్వహించనున్న నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన వీరసింహారెడ్డి సినిమా ప్రీ రిలీజ్ వేడుకలకు తరలివచ్చే అభిమానులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకున్నట్లు అడిషన్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం రాత్రి విలేకరుల సమావేశంలో ఆయన శాఖాపరంగా తీసుకున్న చర్యలను వెల్లడించారు. వేడుకలను దృష్టిలో ఉంచుకొని వాహనాల రాకపోకలు, ప్రజా రవాణాకు ఇబ్బందులు కలగకుండా నగరంలో ట్రాఫిక్ మళ్లించినట్లు వివరించారు. మంగమ్మ కళాశాల, ఏఎంసీ మార్కెట్ యార్డులను పార్కింగ్ కోసం కేటాయించినట్లు తెలిపారు. వేడుకలు సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగుతాయని, చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు వేడుకలకు దూరంగా ఉండటమే మంచిదని సూచించారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగినంత పోలీసు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. అభిమానులు, ప్రేక్షకులు పోలీసులకు సహకరించాలని కోరారు. వేడుకల్లో పాల్గొన్న అభిమానులు ఎవరితోనూ అమర్యాదగా ప్రవర్తించవద్దని, సంతోషకరమైన వాతావరణంలో వేడుకలను ఆస్వాదించాలని సూచించారు. నిర్వాహకులు జారీ చేసే పాసులు ఉన్న వారికే వేడుకలకు అనుమతిస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రూప్‌-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లాలోని 7 కేంద్రాల్లో ఈ నెల 8వ తేదీ నిర్వహణ
- అధికారులతో సమీక్షలో డీఆర్వో బి.చిన ఓబులేసు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు

ఒంగోలు సబర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్‌–1 సర్వీసుల స్క్రీనింగ్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లాలోని అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు ఆదేశించారు. ఈ మేరకు ఆయన చాంబర్‌లో గురువారం అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 8వ తేదీన జిల్లాలోని 7 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఓఎంఆర్ షీట్ల ద్వారా ఆఫ్‌లైన్ విధానంలో ఈ పరీక్ష ఉంటుందన్నారు. దీనికి సంబంధించి ఏపీపీఎస్సీ జారీ చేసిన ఆదేశాలను అందరూ పాటించాలని స్పష్టం చేశారు. ఈ నెల 8వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు.

ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బీ.ఎఫ్–7 కోవిడ్ వేరియంట్ దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో కోవిడ్ ప్రొటోకాల్ పక్కాగా పాటించాలని పేర్కొన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించేటప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అభ్యర్థులు లోనికి తీసుకెళ్లకుండా చూడాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు ఆయన సూచించారు. ఓఎంఆర్ షీట్లు ఓపెన్ చేయటం, అభ్యర్థులకు పంపిణీ, తిరిగి వాటిని కట్టకట్టడం వంటి విషయాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. మాల్ ప్రాక్టీస్ జరుగకుండా నిశిత పరిశీలన అవసరమని పేర్కొన్నారు. దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలను కచ్చితంగా కల్పించాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాలలో తక్షణమే స్పందించేలా వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పరీక్ష సమయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు అవసరమైన ప్రభుత్వ రవాణా సౌకర్యాన్ని కూడా అందుబాటులో ఉంచాలని డీఆర్‌ఓ ఆదేశించారు. సమీక్షలో ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైజనింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పేదవిద్యార్థుల అభివృద్ధే ఆశయం

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

కురిచేడు: పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అభివృద్ధి చెందాలనేదే తమ ఆశయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మండలంలోని పొట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ముందుగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు బీఏఐఎఫ్ సంస్థ సహకారంతో రూ.8 లక్షలతో పాఠశాలకు ఇచ్చిన టాయిలెట్లు, వాటర్‌కూలింగ్ మిషన్, టీవీలు, సైన్సు ల్యాబు, లైబ్రరీ లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో ఉండాలి, అందులో పేద విద్యార్థులు నాణ్యమైన విద్యను అందుకుని అభివృద్ధి చెందాలని మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి ఎల్లప్పుడూ కోరుకునే వారని ఆమె గుర్తు చేశారు. ఆయన ఆశయాలకు కట్టుబడి తాను, తన తనయుడు దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి జీవితాంతం పేద విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేస్తామన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కూడా నవరత్నాలలో ముఖ్యంగా విద్య, వైద్యాన్ని చేర్చి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. స్టడీ మెటీరియల్ ఉపాధ్యాయులు బోధించిన దానికన్నా మెరుగ్గా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు బూచేపల్లి కుటుంబం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. అనంతరం స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వట్టికూటి భవ్య, ఎంఈఓ ఆర్ వస్త్రాంనాయక్, కురిచేడు సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, కురిచేడు, పడమర వీరాయపాలెం సొసైటీ ప్రెసిడెంట్లు గోడులముడి లింగారెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్వీ నాగిరెడ్డి, నారు శ్రీనివాసరెడ్డి, నుసుం ప్రతాపరెడ్డి, అన్నెం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పచ్చాకు కూలీల ఆటో బోల్తా

● ఏడుగురికి గాయాలు



గాయపడిన వ్యక్తులను అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

మద్దిపాడు: పచ్చాకు కూలీలతో వెళుతున్న ఆటో తిరగబడి ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం కొష్టాల సెంటర్ నుంచి నేలటూరు వెళ్లే దారిలో గురవారెడ్డిపాలెం సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. అద్దంకి మండలం వేలమూరిపాడు సమీపంలో ఉన్న ధేనువకొండ పునరావాసకాలనీకి చెందిన వ్యక్తులు నేలటూరులో పచ్చాకు పనులకు వెళుతుండగా గురవారెడ్డిపాలెం సమీపంలో ఆటో డ్రైవర్ వేగంగా నడుపుతూ అదుపు చేయలేకపోవడంతో ఆటో తిరగబడింది. ప్రమాదంలో పి.పద్మ, పి.అంజయ్యలకు తలపై గట్టిగా గాయాలు కాగా మిగిలిన టి.చిన్నమ్మాయి, ఏడుకొండలు, నాగలక్ష్మి, పి.అంజమ్మ, పి.సుజాతలకు స్వల్ప గాయాలయ్యాయి. ఒంగోలు నుంచి బల్లికురవ వెళుతున్న 108కు సమాచారం అందడంతో వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని అద్దంకి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఘటనా స్థలానికి మద్దిపాడు పోలీసులు చేరుకొని ఆరా తీశారు.

జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న స్టెప్ చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి

ఒంగోలు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఆదేశాల మేరకు ఫేజ్ 2 జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక గురువారం స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించారు. కనిగిరి, కంభం, ఒంగోలు, కొత్తపట్నం ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. స్టెప్ చీఫ్ కోచ్ జి.రాజరాజేశ్వరి, ఏకేవీకే కాలేజీ పీఈటీ హరి, ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ చిన్నారావు క్రీడాకారుల ప్రావీణ్యాన్ని పరిశీలించి 12 మందితో జిల్లా జట్టు ఎంపికచేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7,8 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లోల పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులను చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి అభినందించారు.

విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ విజయభాస్కర్

త్రిపురాంతకం: నూతన విద్యా విధానం ద్వారా విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు వచ్చాయని డీఈఓ విజయభాస్కర్ అన్నారు. త్రిపురాంతకం కేజీబీవీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంగ్లిష్ మాధ్యంలో విద్యా విధానం మార్పులు సంతరించుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌ఏ 1 పరీక్షలు, లెసన్ ప్లాన్, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున్‌నాయక్ పాల్గొన్నారు.

జిల్లాలో 63 పాఠశాలలకు సీబీఎస్‌ఈ గుర్తింపు

తర్లుపాడు: జిల్లాలో 63 పాఠశాలలకు సీబీఎస్‌ఈ గుర్తింపు ఇచ్చినట్లు డీఈఓ విజయభాస్కర్ తెలిపారు. మండలంలోని జవహర్ నవోదయ పాఠశాలలో సీబీఎస్‌ఈ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పనిచేస్తున్న 126 మంది ధాదానోపాధ్యాయులు, ఉపాధ్యాయలకు రెండు రోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు. సీబీఎస్‌ఈ అఫలియేషన్ ఎలా చేసుకోవాలి, పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల నమోదు, పరీక్షల తీరు తెన్నుల గురించి వివరించారు. సమగ్రశిక్ష అకడమిక్ అధికారి కేసీహచ్ సుబ్బారావు, ఎంఈఓ రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలి



వాలీబాల్‌లో తలపడుతున్న ఒంగోలు, చీరాల కాలేజీల జట్లు



షటిల్ బ్యాడ్మింటన్స్‌లో తలపడుతున్న ఒంగోలు, అద్దంకి కాలేజీల క్రీడాకారులు

● ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు: ప్రతి ఒక్క విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయి క్రీడాపోటీలను గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి ఉద్యోగంతో జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షిస్తూ అందుకు తగ్గ చర్యలు చేపడుతున్నారని, ఈ నేపథ్యంలో యువత విద్యతో పాటు శారీరక శక్తిని కూడా పెంచుకుంటూ ఉన్నతమైన స్థానంలో నిలదొక్కుకునేందుకు శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలపై మక్కువ పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే జిల్లాస్థాయి పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, బాల్‌బాడ్మింటన్, బాడ్మింటన్, చదరంగం, టేబుల్ టెన్నిస్‌తో పాటు షాట్‌పుట్, రన్నింగ్ వంటి క్రీడాంశాలలో విద్యార్థులు ప్రతిభ కనబరచాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని 15 కాలేజీలకు గాను 8 కాలేజీల నుంచి క్రీడాజట్లు పాల్గొన్నాయి. అనంతరం వాలీబాల్, చదరంగం, టేబుల్ టెన్నిస్, షాట్‌పుట్ వంటి పోటీల్లో క్రీడాకారులు తలపడ్డారు.

మొదటిరోజు విజేతలు..

పాలిటెక్నిక్ ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి తొలిరోజు పోటీలలో చదరంగం, టేబుల్ టెన్నిస్ పోటీలలో ఫలితాలను ఒంగోలు డీఏ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ విడుదలచేశారు. చెస్‌లో పేస్ కాలేజీ ప్రథమస్థానం, డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ద్వితీయస్థానంలో నిలిచాయి. టేబుల్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో రైజ్ పాలిటెక్నిక్ ప్రథమస్థానం, పేస్ పాలిటెక్నిక్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. షటిల్ పోటీలను స్థానిక హైదరీ క్లబ్‌లో ప్రారంభించామని, శుక్రవారం స్థానిక డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో అథ్లెటిక్స్ నిర్వహిస్తామన్నారు. డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.



షాట్‌పుట్ విసురుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

థెరీసమ్మ ఆశయాల కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు బలరాం, రాంబాబు



థెరీసమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ, డాక్టర్ సతీష్

● వర్ధంతి సభలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి
● పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్‌లు
● మంత్రి సురేష్‌కు పలువురి పరామర్శ

మార్కాపురం: జార్జి విద్యా సంస్థల చైర్‌పర్సన్ థెరీసమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో థెరీసమ్మ సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో విద్యా రంగ వ్యాప్తికి థెరీసమ్మ, ఆమె భర్త డాక్టర్ శామ్యూల్ జార్జితో కలిసి చేసిన కృషిని మరచిపోలేమన్నారు. జిల్లాలో మొదట ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసి సాంకేతిక విద్యను విద్యార్థులకు అందించిన ఘనత వారిదేనన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ 50 సంవత్సరాల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో ఉండి వేలాది మంది విద్యార్థులను ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దిన థెరీసమ్మ అందరికీ ఆదర్శప్రాయమన్నారు. జార్జి విద్యా సంస్థలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. అక్షర శిల్పి థెరీసమ్మను ఆదర్శంగా తీసుకోవాలని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. థెరీసమ్మ కుమారులు మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, సతీష్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేస్తామని, జార్జి విద్యా సంస్థల ఔన్నత్యాన్ని కాపాడతామన్నారు. థెరీసమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. డాక్టర్ సురేష్, సతీష్‌లను పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పరామర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కరణం బలరాం, సుధాకర్‌బాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు ఉడుముల శ్రీనివాసరెడ్డి, కందుల నారాయణరెడ్డి, మాల, మాదిగ, రెల్లి, గ్రంథాలయ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు అమ్మాజీ, కనకరావు మాదిగ, మధుసూదనరావు, శేషగిరిబాబు, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ సునీల్‌కుమార్, ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్, సబ్ కలెక్టర్ సేథు మాధవన్, టిడ్కో ఎండీ శ్రీధర్, డీఎస్పీ కిషోర్‌కుమార్, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల కృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ ఎం.షంషీర్ అలీబేగ్, వెన్నా హనుమారెడ్డి, లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, మార్కాపురం, యర్రగొండపాలెం చైర్మన్‌లు గొలమారి శ్రీనివాసరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ, ఎర్రగొండపాలెం, దోర్నాల, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, మార్కాపురం, తర్లుపాడు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కార్పొరేషన్‌ల డైరెక్టర్లతో పాటు కళాశాల ప్రిన్సిపల్ రాజబాబు, కళాశాల సిబ్బంది పాల్గొని థెరీసమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

సమస్యలు పరిష్కరించేందుకే ముఖాముఖి

● ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పద్మా జనార్దన్‌రెడ్డి

యర్రగొండపాలెం: విద్యుత్‌లో తలెత్తే సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు వినియోగదారులతో ముఖాముఖి ఏర్పాటు చేశామని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మా జనార్దన్ రెడ్డి అన్నారు. వినియోగదారుల వద్దకే విద్యుత్ శాఖ కార్యక్రమంలో భాగంగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో విద్యుత్ వినియోగదారులతో గురువారం ఆయన స్వయంగా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి గురువారం జిల్లాల్లో, రెండో గురువారం గుంటూరులో, మూడో గురువారం విజయవాడలో విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖి ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమస్యలు ఎక్కువగా ఉన్న యర్రగొండపాలెంలో కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రైతులకు, ఇతర విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యుత్‌లో తలెత్తున్న సమస్యలను వినియోగదారుల నుంచి తెలుసుకొని, తమ శాఖాధికారులను అప్రమత్తం చేసేందుకు కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పరిశ్రమల నిర్వాహకులు, కమర్షియల్ వినియోగదారులతో కూడా ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చోరీకి, అగ్ని ప్రమాదాలకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని, నిబంధనల ప్రకారం ఆ ట్రాన్స్‌ఫార్మర్ రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని అందజేస్తే వెంటనే కొత్తవి ఏర్పాటు గానీ, మరమ్మతులు చేయడం గానీ చేస్తామన్నారు. రైతులు పోలీస్ ఎఫ్ఐఆర్‌ను తీసుకొని రాలేకపోతున్నారని, ఈ విషయాన్ని డీజీపీ దృష్టికి తీసుకువెళతామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రస్తుతం ఉన్న నిబంధనలను సడలించి అటువంటి ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 48 గంటల్లో కొత్తవి ఏర్పాటు చేసేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గత సంవత్సరం విద్యుత్ వినియోగదారులకు సేవలందించడంలో రాష్ట్రం దేశంలో మొదటిస్థానంలో నిలిచిందని, ఈ మేరకు తమ శాఖకు అవార్డు లభించిందని తెలిపారు. జిల్లాలో 2022 జనవరి నాటికి 191 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవడం, కాలిపోవడం లాంటివి కేసులు నమోదయ్యాయన్నారు. ఈ సంవత్సరం 2023జనవరి నాటికి 160 కేసులు మాత్రమే నమోదు అయ్యాయని చెప్పారు. జిల్లాలోని రైతులకు 12,158 సర్వీసులకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశామని, వాటిలో 4,800 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. పొలాల్లో పంటలు ఉండటం, వర్షాలు కురుస్తుండటంతో మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయలేకపోయామని, నెలరోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. మరో 10వేల ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆ శాఖ ఎస్ఈ కేజీవీ సత్యనారాయణ, ఈఈ పీవీ నాగేశ్వరరావు, టెక్నికల్ ఈఈ ఎ.సత్యనారాయణ, ఎస్ఏఓ కె.సుబ్బారావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరెడ్డి, ఏడీ టి.రాఘవేంద్రరావు, ఏఈఈలు పి.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, మంగారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మా జనార్దన్‌రెడ్డి

క్రీడలతో మంచి భవిష్యత్

కొత్తపట్నం: క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని ఇండియన్ బ్యాంకు మేనేజర్ ఎస్ శాంతిసుమన్ అన్నారు. స్థానిక ఉలిచి వెంకారెడ్డి–వెంకాయమ్మ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో గురువారం 25వ జిల్లాస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభచాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం షటిల్, వాలీబాల్, సాఫ్ట్‌బాల్, లాంగ్ జంప్, హైజంప్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. శుక్రవారం ఫైనల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఏసుప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న బ్యాంకు మేనేజర్

మార్కాపురంలో చోరీ



చోరీ జరిగిన ఇల్లు

మార్కాపురం: ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన గురువారం పట్టణంలోని కరెంట్ ఆఫీస్ దగ్గర జరిగింది. బాధితురాలు లిఖిత భర్త రంగనాయకుల కథనం ప్రకారం..గురువారం ఉదయం 10.30కు లిఖిత తన కుమారున్ని అంగన్‌వాడీ స్కూల్‌లో దించేందుకు వెళ్లి మధ్యాహ్నం 12.30కు ఇంటికి రాగా ఇంటి తాళం తీసి ఉండటాన్ని గుర్తించింది. ఇంట్లోకి వెళ్లి చూస్తే బీరువాలోని చైను, ఉంగరం, గాజులతో పాటు రూ.2 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వరుస దొంగతనాలతో భయం..

పట్టణంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు భయపడుతున్నారు. బుధవారం వడ్డెబజారులోని హనుమాన్‌సింగ్ ఆరు తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. మూడు రోజుల క్రితం తర్లుపాడు రోడ్డులో వేల్పుల వెంకటరెడ్డి ఇంట్లో నగదు, ఆభరణాలు అపహరించారు. గత నెల 28న నాయుడుబజారులోని బంగారు దుకాణంలో ఇద్దరు మహిళలు కొనుగోలుదారులుగా వచ్చి బంగారు కమ్మలు తీసుకెళ్లగా పోలీసులు కనుగొని అరెస్టు చేశారు.

ప్రతి ఇంటికి మంచినీరు సరఫరా



ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట

టంగుటూరు: ప్రతి ఇంటికి మంచినీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మండలంలోని వల్లూరులో ఓవర్‌హెడ్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసురెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.25 లక్షల అంచనాతో 40 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకు నిర్మాణాన్ని 5 నెలల్లో పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. తొలుత వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అభివృద్ధి, సంక్షేమ ప్రభుత్వానికి రెండు కళ్లు..

ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా పాలన సాగిస్తోందని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. వల్లూరులో కుందం కోటిరెడ్డి మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించగా ఎంపీ మాగుంట, వరికూటి అశోక్‌బాబు ప్రారంభించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం నిధుల కింద రూ. 20 లక్షలతో నిర్మించిన డ్రైనేజీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, ఇరిగేషన్ ఏసీ లక్ష్మారెడ్డి, తహసీల్దార్ చిరంజీవి, ఎంపీడీఓ అజిత, పార్టీ మండల అధ్యక్షుడు సూదనగుంట శ్రీహరిరావు, కొండపి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు, రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, సొసైటీ అధ్యక్షుడు రావూరి ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ వల్లూరి పద్మ, ఎంపీటీసీ యలసిరి సత్యవాణి, వల్లూరమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

9 నెలల చిన్నారికి డెంగీ

కొమరోలు : 9 నెలల చిన్నారి డెంగీ వ్యాధి బారిన పడింది. మండలంలోని రాజుపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలోని నల్లగుంట్ల ఎస్సీపాలెంకు చెందిన 9 నెలల చిన్నారి దండు రిత్విక గత 5 రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా కర్నూలులోని ప్రైవేట్ వైద్యశాలలో తల్లిదండ్రులు పరీక్షలు చేయించారు. డెంగీ జ్వరం ఉన్నట్లుగా వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న రాజుపాలెం వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ భాను సిబ్బందితో నల్లగుంట్లలో పారిశుద్ధ్య చర్యలకు ఆదేశించగా ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సర్పంచ్ ప్రదీప్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రజలను జ్వరాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.